ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 17 | సంచిక : 11 | జూలై 2012

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 16-04-2012, పాలకొల్లు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భగవద్గీత 700 శ్లోకాలు చదవలేని వాళ్ళు ఈ ఒక్క శ్లోకం చదివి మననం చేస్తే చాలు, ఇదే గీతాసారం అని ఆచార్యుల వారు చెప్పారు.

**మత్కర్మ కృన్మత్పరమో మద్భక్త స్సఙ్గవర్జితః**
**నిర్వైరస్సర్వ భూతేషు యస్సమామేతి పాణ్డవ.** (11అ 55 శ్లో)

భగవద్గీత మొత్తానికి ఈ శ్లోకం ముఖ్యమైనది అని ఎందుకు చెప్పారు అంటే నాలుగు యోగాలు ఈ శ్లోకంలో ఇమిడి ఉన్నాయి. కర్మయోగం, భక్తియోగం, ధ్యానయోగం, జ్ఞానయోగం అన్ని యోగాలు ఈ ఒక్క శ్లోకంలో కలిపాడు. అందుచేత ఈ ఒక్క శ్లోకం మీరు మననం చేస్తే మీకు భగవంతుడుని తెలుసుకోవటానికి దారి కనిపిస్తుందని ఆచార్యులవారు చెప్పారు. మత్‌కర్మకృత్ అంటే నాకోసం పనిచెయ్యండి అన్నాడు. మనం ఏ పని చేసినా అది భగవంతుడికి ఇష్టమయినదిగా ఉండాలి. ఈశ్వరార్పితముగా పనిచెయ్యాలి అంటే సత్‌కర్మ నిష్కామంగా చెయ్యాలి. భగవంతుడు వద్దన్న పని మానేసి చెయ్యమన్నపని చేస్తోంటే అది భగవంతుడి పనే. మీరు ఏపని చేసినా భగవంతుడు సమాజ రూపంలో ఉన్నాడనే భావంతోటి చెయ్యాలి. మనకి స్వతంత్ర బుద్ధి పనికిరాదు అంటే అహంకారం పనికిరాదు. ఇది విధి, ఇది నిషేధం అని పరమాత్మ చెప్పాడు. భగవంతుడు ఈ పని చెయ్యండి అంటే చెయ్యటం, భగవంతుడు వద్దని చెబితే ఆపని మానెయ్యటం, ఆపని ఎందుకు వద్దన్నాడు అని విమర్శలజోలికి వెళ్ళవద్దు అన్నారు. అది మన శ్రేయస్సుకోసమే చెప్పాడు. కానీ మనకి శ్రేయస్సు ముఖ్యంకాదు. ప్రేయస్సు మనకి ముఖ్యం. మనకి మంచి చెప్పేవాడి కంటే మనల్ని పొగిడే

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 20
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)
చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-
చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥
పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

పాలకొల్లు ....... 16-04-2012
భీమవరం ....... 25-05-2012
గుండుగొలను . 13-06-2012

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

వాళ్ళు అంటే మనకి ఎక్కువ ఇష్టం. అహంకారం మంచి మాటల్ని అంగీకరించదు, అది నిజమయితే మంచి మాటల్ని అంగీకరిస్తుంది అసలు అహంకారమే నిజంకాదు కదా అందుచేత అహంకారం నిజాన్ని యాక్సెప్ట్ చేయలేదు.

మన మనస్సు భగవంతుడు చెప్పిన మాటల్ని నమ్మినట్టుగా నటిస్తుంది కాని మనస్సు నమ్మదు. భగవంతుడి మాటల పట్ల విశ్వాసం పెరిగితే మన మనస్సు అణుగుతుంది. నీకు శాస్త్రం ప్రమాణం కాని నీ మనస్సు, నీ బుద్ధి ప్రమాణం కాదు. భగవంతుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. అందుచేత ఏ శరీరానికి నువ్వు మంచి చేసినా ఆ శరీరంలో ఉన్న ఈశ్వరుడికే చేస్తున్నాను అని, ఆ లోపల ఉన్న ఈశ్వరుడినే చూడుకాని వారి శరీరం చూడవద్దు, పేరు చూడవద్దు, కులం చూడవద్దు. కృష్ణుడు ఎక్కడా ఈ కులస్థుడు బాగుపడతాడు, ఈ కులస్థుడు బాగుపడడు అని చెప్పలేదు. ఎవరయితే నామాటలను శ్రవణం చేసి, ఆ ప్రకారం జీవిస్తున్నారో వాళ్ళు బాగుపడతారని చెప్పాడు. అంటే దైవసంపద ఉన్నవాడు ఏకులం వాడు అయినా, ఏ ప్రాంతంవాడు అయినా బాగుపడతాడు. అయితే అక్కడ సద్బుద్ధి ఉండాలి, సహృదయం ఉండాలి. ఒకసారి రమణమహర్షిగారు హాలులో కూర్చున్నప్పుడు మాటల సందర్భంలో ఏమన్నారంటే, నా సంపదలో ఈ హాలులో కూర్చున్న పదిమందే వాటాదారులు కాదు. ప్రపంచంలో ఏ మూల ఉన్నా వాడికి సద్బుద్ధి ఉంటే, సహృదయం ఉంటే వాడు స్త్రీ అవ్వవచ్చు, పురుషుడు అవ్వవచ్చు, జంతువు అవ్వవచ్చు ఎవడైనా సరే నా సంపదలో వాటాదారుడు అని చెప్పారు. మనం నేను, నేను అంటాం కదా, మీలో ఉన్న నేనుని కాని, ఎదుటి మనిషిలో ఉన్న నేనుని కాని అలంకరించటం కోసం మీరు ఒక మాట మాట్లాడవద్దు, చేత్తోటి ఒకపని చెయ్యవద్దు, దాని తాలూక తలంపులు రానివ్వవద్దు. అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడినే దృష్టిలో పెట్టుకుని చెయ్యండి అని భగవాన్ అన్నారు. చాలామంది మాకు గుర్తింపులు లేవు అంటారు. అసలు గుర్తింపులే ప్రమాదం. ఇంట్లో వాళ్ళే, ఇంట్లోవారి గుర్తింపులు కోరుకుంటారు. అసలు గుర్తింపు ఎవడికి కావాలి. చైతన్యానికి రెండోవ్యక్తిలేడు. అహంకారానికి రెండో వ్యక్తి ఉన్నాడు. నీ మనస్సుకి, నీ వ్యక్తీభావనకి గుర్తింపుకావాలి. అంటే నువ్వు అహంకారాన్ని పెంచుకోవటానికి గుర్తింపులు కోరుతున్నావు. నీ అహంకారం సంతృప్తి పడే పనులు చేయకు. నీ లోపల అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నాడు, ఆయనకు ప్రీతికలిగే పనులు కనుక నువ్వు చేస్తే నీ మనస్సు అంతర్ముఖమవుతుంది, నీ మనస్సు నిర్మలమవుతుంది. నీ మనస్సు నిశ్చలమవుతుంది, అది ఆత్మాకారం చెందుతుంది.

ఆచార్యులవారు ఏమని చెప్పారంటే సత్‌కర్మనిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది. అంటే బుద్ధి శుద్ధి అవుతుంది. బుద్ధి శుద్ధి అయిన తరువాత ఆత్మజ్ఞానానికి ఆ మనిషి ఫిట్ అవుతాడు. నువ్వు మంచిపని చేసినంతమాత్రం చేత నీకు ఆత్మజ్ఞానం

కలగదు. ఇక్కడ రహస్యం ఏమిటి అంటే మీ మనస్సుకి ప్రీతి కలిగించే పనులు కాకుండా భగవంతుడికి ప్రీతి కలిగే పనులు, భగవంతుడికి సంతోషం కలిగే పనులు కనుక మీరు చేస్తే ఆయనని తెలుసుకోవటానికి మీకు ఎటువంటి బుద్ధిని ఇస్తే మీరు తెలుసుకుంటారో అటువంటి బుద్ధిని ఆయన మీకు ప్రసాదిస్తాడు. డబ్బు, పదవి సంపాదించటం కంటే, సమాజంలో గౌరవం సంపాదించటం కంటే మంచిబుద్ధిని సంపాదించటం చాలాకష్టం. కొంతమంది భక్తులు గుడికి వెళతారు. వాళ్ళు స్వామిని కుటుంబవిషయాలు గురించి ప్రార్థించరు. సమాజ విషయాలు గురించి అడగరు. స్వామీ మాకు మంచిబుద్ధిని ప్రసాదించు అని ప్రార్థిస్తారు. అటువంటి భక్తులను చూస్తే నాకు ఏనుగు మీద కూర్చున్నట్లు ఉంటుంది. తుకారామ్ అన్నాడు లౌకికులకి చావులు, పుట్టుకలు కాని భక్తికి చావు లేదు, పుట్టుక లేదు అన్నాడు. శరీరం పుడుతుంది కానీ భక్తి పుట్టేది కాదు. అది ఎప్పుడూ నీ హృదయంలో ఉండేది. నీ శరీరం మరణించిన తరువాత ఆ భక్తి నీకూడా వచ్చేస్తుంది. అందుచేత నువ్వు భక్తిని సంపాదిస్తే చావు పుట్టుకలు లేని స్థాయికి చేరుకుంటావు అని తుకారాం అన్నాడు.

సాధకుడు ప్రతీక్షణం జాగ్రత్తగా ఉండాలి. కాలాన్ని పాడుచేసుకోకూడదు. మన భక్తులు కూడా కాలాన్ని పాడుచేసుకుంటున్నారు. డబ్బుపోతే మళ్ళీ సంపాదించుకోవచ్చు, అధికారం పోతే మళ్ళీ సంపాదించవచ్చు కాని కాలం మళ్ళీ తిరిగిరాదు. ఇప్పుడు 60 సంవత్సరాలు ఉన్న మనిషికి మళ్ళీ 20 సంవత్సరాలు రమ్మంటే రావు. అందుచేత కాలాన్ని 100 % సద్వినియోగం చేసుకోవాలి. శాస్త్రంలో టైము మేనేజ్‌మెంట్ తెలుసుకోమని చెప్పాడు. మనం జపం ఎంత టైము చెయ్యాలి, ధ్యానం ఎంత టైము చెయ్యాలి, మన పెర్సనల్ వర్కు ఎంతవరకూ ఉంది, మనం సమాజానికి ఉపయోగపడేది ఎంత ఉంది, ఎంత టైము మనం పాడుచేస్తున్నాము, ఎంత టైముని ఉపయోగించుకుంటున్నాము అని టైము మేనేజ్‌మెంటు ఎవడికైతే బాగా తెలుసో వాడే బాగుపడతాడు. మనకి టైము మేనేజ్‌మెంటులేదు. ఎందుకూ పనికిరాని సోది చెప్పుకుని గంటల తరబడి, రోజుల తరబడి టైము వేస్టు చేస్తున్నాము. కానీ మనకి మరణటైము వచ్చినప్పుడు భగవంతుడు మీకు ఒక గంట టైము అదనంగా ఇమ్మంటే ఇవ్వడు. అందుచేత ఉన్న టైముని మనం సద్వినియోగం చేసుకోవాలి. సాధన లేకుండా సిద్ధి కలగదు. ఒక్క చైతన్యం తప్పించి, భగవంతుడు గురించి తప్పించి ఇతర మాటలు రామకృష్ణుడి దగ్గర మాట్లాడితే బయటకు పంపేసేవాడు. అన్య సంభాషణలు అక్కడ రానివ్వడు. ఎందుచేతనంటే మనిషి బాగుపడటానికి వంద సంవత్సరాలు పడితే వాడు పాడయిపోవడానికి ఒక గంట చాలు. మాయ అంత బలీయమైనది. అందుచేత మనం పాడయిపోవటం తేలిక, బాగుపడటం కష్టం. ఒకవేళ బాగుపడ్డా, ఒక్క నిమిషం అజాగ్రత్తగా ఉంటే నువ్వు తిరిగి పాడయిపోవచ్చు. ఇహం సాధించాలన్నా, పరం సాధించాలన్నా సోమరితనం

ఉండకూడదు, బద్ధకం ఉండకూడదు. ఆంగ్లభాషలో ఒక సామెత ఉంది, సోమరితనం, బద్ధకం ఈ రెండూ ఎవడి దగ్గర ఉన్నాయో వాడి ఇంటి చుట్టూ దారిద్ర్యం తిరుగుతూ ఉంటుంది అన్నారు.

నన్ను గమ్యంగా పెట్టుకుని మీరు సాధనలు చేస్తే నన్ను పొందుతారు, మీరు లోక విషయాలు గమ్యంగా పెట్టుకుని నన్ను జపించినా ఆలోకవిషయాలు నెరవేరవచ్చు కాని మీరు నన్ను పొందలేరు అని పరమాత్మ చెప్పాడు. దైనందినజీవితంలో నీ ప్రవర్తన ఎలా ఉంది అనే దానిని బట్టే మనస్సు అంతర్ముఖం అవుతుంది. నీ ఆలోచన, వాక్కు, పని ఈ మూడు సమానంగా ఉండాలి. మధ్భక్తః అంటే పరిస్థితులు అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా ఈశ్వరుడి పట్ల విశ్వాసం పోకూడదు. నాకు భక్తుడిగా ఉండు. నా పట్ల ప్రేమ, భక్తి, శ్రద్ధ కలిగి ఉండాలి. నా రూపాన్ని ధ్యానం చేస్తూ ఉండాలి, నా నామాన్ని స్మరిస్తూ ఉండాలి. మీరు మంచి పనులు చేస్తే మీకు దుర్గతి లేదు అని పరమాత్మ చెప్పాడు. మనకి శ్వాసపోయినా ఈశ్వరుడి పట్ల విశ్వాసం పోకూడదు. విభీషణుడు రాక్షసుడే కానీ మంచికోసం అన్నగారిని వదులుకున్నాడు. రాముడికోసం అంటే దేవుడికోసం సర్వస్వం వదులుకుని రాముడిని ఆశ్రయించాడు. అది భక్తుడి లక్షణం. అది దీర్ఘశరణాగతి. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం ఉంటే చాలు. మీ మనస్సు కండిషన్‌లో పడిపోతుంది, మీరు బాగుపడతారు. మీ మనస్సు అశాంతిగా ఉంటుంది అనుకోండి, చెడ్డవైపు జరుగుతోంది అనుకోండి, మీకు తొందరగా నిద్రరావటం లేదు అనుకోండి. మీరు రామనామం కనుక శ్రద్ధగా చేస్తే ఇంద్రియచాపల్యం తగ్గిపోతుంది, మనస్సులో ఉన్న చాపల్యం తగ్గిపోతుంది. బుద్ధికి ఏకాగ్రత కలుగుతుంది. అప్పుడు మనస్సు అంతర్ముఖం అవుతుంది. అది ఆత్మారాముడిని అందుకుంటుంది. మీరు రామనామాన్ని శ్రద్ధగా చేయటం వలన మనం బాగుపడాలి అనే సంకల్పం కలుగుతుంది. రామనామం లక్ష్మీప్రదమైనది. మీరు తరించటానికి ఒక్క రామనామం చాలు అయితే ఆ నామం మన రక్తంలో ఒక భాగం అయిపోవాలి. గాంధీగారిని కాల్చినప్పుడు ఆయన వెంటనే హృదయంలోంచి హేరామ్! హేరామ్! అన్నాడు. మూడోసారి హేరామ్ అనేటప్పటికి పడిపోయి ప్రాణం వదిలేశాడు. గాంధీగారు చనిపోయి నప్పడు రాజగోపాలాచారి ఒక మాట చెప్పాడు. ఇప్పటి వరకూ గాంధీ ఈజ్ మోర్టల్, కాని ప్రాణప్రయాణ టైములో ఆత్మారాముడిని పట్టుకున్నాడు. శరీరం చనిపోయింది, ఆత్మకు చావులేదు. లోపల చావులేని స్థితిని పొందాడు. అందుచేత నౌ హి బికేమ్ ఇమ్మోర్టల్ అన్నాడు.

కృష్ణుడు అర్జునుడితో నువ్వు యుద్ధం చేయటానికి వచ్చావు. అది నీ దేహ ప్రారబ్దం. ప్రారబ్దం లేకపోతే అసలు ఏ దేహం రాదు. కామ్యకర్మలు చేస్తూ ఉంటే ప్రారబ్దం ఏర్పడుతుంది.

ప్రారబ్ధం ఏర్పడితే దేహం రాకుండా ఆగదు. నీ దేహప్రారబ్ధంలో యుద్ధం చేయవలసి ఉంది. యుద్ధం చేయటం నీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా నీ దేహం ద్వారాయుద్ధం జరుగుతుంది. నువ్వు యుద్ధం ఇష్టంగా చేస్తే రాబోయే జన్మలో ఈ ప్రారబ్ధం రిపీట్ అవ్వదు. పని చెయ్యటం ఎలాగూ తప్పదు. నువ్వు ఇష్టం లేకుండా చేస్తే రాబోయే జన్మల్లో కూడా ఈ ప్రారబ్ధమే నిన్ను వెంటాడుతుంది. ఇది గీతారహస్యం. మత్‌కర్మ అంటే నా గురించి పనిచెయ్యి ఇది కర్మయోగం. మత్‌పరమః అంటే నన్నే స్మరించు, నన్నే ధ్యానించు ఇది ధ్యానయోగం. మద్‌భక్తః అంటే నా భక్తుడవు అవ్వు ఇది భక్తియోగం. సంఘవర్జితః ఇది జ్ఞానయోగం అంటే ప్రపంచంలో ఏ వస్తువు మీద కాని, నీ దేహం మీద కాని ఆసక్తి ఉండకూడదు. మీకు ఏ తలంపు వచ్చినా దేహము నేను అనే బుద్ధిలోంచే వస్తుంది. ఇతర తలంపులన్నింటికీ కేంద్రం ఈ దేహము నేను అనే తలంపే. ఈ తలంపు నశించేవరకూ ఇతర తలంపులు నీకు వస్తూనేఉంటాయి. దేహము నేను అనే తలంపు అది నీకు లోపలినుంచి వస్తోందా, బయటినుంచి వస్తోందా? ఆ తలంపు లోపలి నుంచే వస్తోంది. అది ఎక్కడ నుంచి వస్తోందో ఆ సోర్సును నువ్వు కనుక తెలుసుకోగలిగితే దేహగతమైన నేను పోతుంది, అప్పుడు ఇంకో నేను నిన్ను పట్టుకుంటుంది. అదే బ్రహ్మము. అది కూడా నీకు నేనుగా వ్యక్తమౌతుంది. కాని అది ఒక దేహానికి, ఒక పదార్థానికి, ప్రపంచానికి పరిమితం కాదు. అది అఖండం అదే ఆనందస్వరూపం, అదే సత్యస్వరూపం, అదే జ్ఞానస్వరూపం. ఉండటం అంటే అదే.

ఒక బ్రహ్మపదార్థం తప్పించి, ఈశ్వరుడు తప్పించి మిగతావన్నీ తలంపులే, పుట్టటం తలంపే, చావు కూడా తలంపే. నీ హృదయంలో ఒక చావులేని సత్‌పదార్థం ఉంది. దానినే ఆత్మ అంటారు. అంతటా వ్యాపించి ఉన్న దానిని బ్రహ్మము అంటారు. నీలోపల ఉన్న ఆత్మ, అంతటా వ్యాపించి ఉన్న బ్రహ్మపదార్థము రెండూ వేరు కాదు. ఇవి రెండూ వేరుకాదని నీకు ఇప్పుడు తెలియదు. నీ లోపల ఉన్న ఆత్మ నీకు అనుభవైకవేద్యం అయ్యాక అంతటా వ్యాపించి ఉన్న వస్తువు ఇదీ ఒకటే అని, దానికీ దీనికీ భేదం లేదని నీకు తెలుస్తుంది. ఏసుక్రీస్తు అన్నాడు నీ హృదయంలో సత్యం ఉంది. సూర్యుడికి చీకటి ఎలా ఉంటుందో తెలియదు. అలాగే నీ హృదయంలో ఉన్న సత్యానికి చావు ఎలా ఉంటుందో తెలియదు, పుట్టుక ఎలా ఉంటుందో తెలియదు. అది డిపెండెంట్ కాదు, ఇండిపెండెంట్. నువ్వు శాశ్వత పదవి పొందాలంటే, నువ్వు పరలోకం పొందాలంటే, ముగింపు లేని శాంతి, ఆనందం, నువ్వు పొందాలి అంటే, స్వతంత్రమైన సుఖం పొందాలి అంటే "నువ్వు సత్యాన్ని తెలుసుకోవాలి, అంటే సత్యం నీకు అనుభవం లోనికి రావాలి" అంతవరకూ నీకు స్వేచ్ఛలేదు, నీకు సుఖంలేదు, ఆనందం లేదు. సంఘవర్జితః అంటే నువ్వు ఎక్కడా ఆసక్తి పెట్టుకోవద్దు. మీరు మీ ఇంట్లో వాళ్ళకి ఏదైనా చేసినా డ్యూటీకింద చెయ్యండి కాని పొగడ్తలు ఆశించి చెయ్యకండి. మీ మనస్సులో వాళ్ళని మొయ్యకూడదు, మనస్సులో దేవుడే ఉండాలి. డ్యూటీ చేస్తున్నాం అనుకున్న

వాడు పొగడ్తలకోసం ఎవడూ ఆశించడు.

నీ దేహ ప్రయాణం కోసం, నీ పొట్ట గడవటం కోసం ఇతరుల మీద ఆధారపడకు. నీ పని ఏదో నువ్వు చేసుకో. ఎక్కడో భోజనాల సత్రం ఉంది. మనం భోజనాలు అక్కడ తిని కాలక్షేపం చేసేద్దాం అని అలా అనుకోకు. నువ్వు ఎదుటి వాళ్ళ డబ్బు మీద, ఎదుటి వాళ్ళు పెట్టే అన్నం మీద ఎంతకాలం ఆధారపడి బతుకుతావు. నువ్వు ఇతరుల మీద ఆధారపడితే బానిసత్వం వచ్చేస్తుంది. వాళ్ళు చెప్పినట్టు మనల్ని వినమంటారు. నీకు బానిసత్వం రాకుండా నీ కాళ్ళమీద నువ్వు నిలబడేలాగ నీ పని ఏదో నువ్వు చూసుకో. ఆచార్యులవారు బాగా చదుకున్నవాడు, ఆయన చదువుకున్నది ఇతరులకి అర్థమయ్యేలాగ చెప్పటానికి దేశం అంతా తిరిగాడు. అదికూడా ఒక యజ్ఞం. కొంతమందికి ధనం ఉంటుంది. శరీరయాత్రకి ఇబ్బంది లేకుండా కొంత ధనాన్ని కేటాయించి మిగిలిన ధనాన్ని సమాజానికి ఉపయోగిస్తే అది ద్రవ్యయజ్ఞం. స్వార్థం లేకుండా, లౌకికమైన ప్రయోజనాల కోసం కాకుండా యజ్ఞభావనతోటి జపం చెయ్యి. అది జపయజ్ఞం. స్వాధ్యాయ యజ్ఞం అంటే రామాయణం కాని, భాగవతం కాని, ఉపనిషత్తులు కాని మీరు చదివి దానిని అర్థం చేసుకోవటం కూడా యజ్ఞమే. మనం ఇప్పుడు ఇక్కడ మాట్లాడుకొంటున్నాము. మనం దీనిని మీటింగు అంటాము. అది తప్పు. ఇది మీటింగుకాదు. ఇది జ్ఞానయజ్ఞం. అంటే ఏరకంగా అయినా మీ కాలాన్ని భగవంతుడని పొందటానికి ఉపయోగించాలి. మీ దేహయాత్ర వెళ్ళేలాగ మీరు సంపాదించుకుని మిగతా టైము అంతా భగవంతుడినే ధ్యేయంగా పెట్టుకుని భగవంతుడిని పొందటానికి ప్రయత్నం చేసుకుంటే అప్పుడు మీ మనస్సు అంతర్ముఖం అవుతుంది. ఏదో పదినిమిషాలు కూర్చుని సాధన చేస్తే సరిపోదు. దైనందిన జీవితంలో మీ ప్రవర్తనని బట్టే మీ మనస్సు అంతర్ముఖమవుతుంది. చేతిలో డబ్బు ఉంటే బజారులో వస్తువు కొనుక్కోవటం ఎంత తేలికో, మనస్సు అంతర్ముఖమయితే ఆత్మజ్ఞానం సంపాదించటం అంత తేలిక.

మీరు ఇంటి దగ్గర ప్రశాంతంగా కూర్చుని ఏ వాసనవల్ల, ఏ సంస్కారం వల్ల, ఏ తలంపువల్ల, ఏ అలవాటువల్ల మన మనస్సు బయటకు వెళుతోంది అని స్కేనింగుచేసి చూచుకోవాలి. అసలు మన మనస్సు బాహ్యముఖానికి ఎందుకు వెళుతోంది. ఏ వాసనవల్ల మనస్సు బయటకు వెళుతోందో చూచుకొని ఆ వాసన లేని వాళ్ళతోటి సహవాసం చేయాలి, ఆవాసన రెడ్యూస్ చేసే గ్రంధాలు చదవాలి. రోగం తొందరగా తగ్గాలి అంటే ఒక ప్రక్కన పథ్యం చెయ్యాలి, ఒక ప్రక్కన మందులు వేసుకోవాలి. మనం యుద్ధానికి వెళ్ళాలంటే ఎలా ప్రిపేర్ అవుతామో అలా వాసనలు తగ్గడానికి అంత ప్రిపేర్ అయితే ఆవాసన చచ్చిపోతుంది. వాసనలను చంపటానికి మనం అన్ని రకాలుగా ప్రయత్నం చేసిన చివర నిమిషంలో మటుకి గురువు ఇంటర్‌ఫియర్ అవ్వాలి. దానినే డివైన్‌ఇంటర్‌ఫియరెన్స్ అంటారు. మన ప్రయత్నం

మనం పూర్తిగా చెయ్యాలి. చివరలో డివైన్ ఇంటర్‌ఫియరెన్స్ వస్తుంది. ఆ డివైన్ ఇంటర్‌ఫియరెన్స్ తోటి వాసనలు జీరో అయిపోతాయి. ఆచార్యులవారు భజగోవింద శ్లోకాలలో ఏమని చెప్పారంటే నీ మనస్సుని ఉద్రేకపరచే మాటలు మాట్లాడవద్దు, నీ మనస్సుని ఉద్రేక పరచేపనులు చేయవద్దు, నీ మనస్సుని ఉద్రేకపరచే పదార్థాలు తినవద్దు, నీ మనస్సుని ఉద్రేకపరచే మాటలు వినవద్దు. నీలో ఉన్న దురలవాట్లు, దురభ్యాసాలు తగ్గించుకోవాలంటే వర్షిప్‌గోవింద, గోవింద నామాలని స్మరించుకో అప్పుడు చెడు గుణాలన్నీ పోతాయి. గోవిందనామం ఒక్కటే నీ ప్రాణప్రయాణంలో నిన్ను రక్షిస్తుంది. అంతకంటే నిన్ను రక్షించే వాళ్ళు ఎవరూ లేరు. గోవిందుడిని భజించు, పెద్దలను ఆశ్రయించు, నీకు కలిగి ఉన్న దానిని ఇతరులతో షేర్ చేసుకో, భగవంతుడు చెప్పిన వాక్యాలని భగవంతుడితోటి సమానమనుకుని వాటిని శ్రవణం చెయ్యి, ఎదుటివాళ్ళకి జ్ఞానం పెంచేమాటలు మాట్లాడు, ఎదుటివాళ్ళని ఉద్రేకపరచే మాటలు మాట్లాడకు ఇవన్నీ ఆచార్యులవారు చెప్పారు. నాకు పరిస్థితులు అన్నీ అనుకూలంగా ఉన్నప్పటికీ, నేను విద్యావంతుడను అయినప్పటికీ ఓ గోవిందా, ఓ కృష్ణా నాకు అవినయం రాకుండా కాపాడు. ఒకవేళ నాకు అవినయం వస్తే బయటికి బాగున్నా నేను లోపల శుభ్రంగా కుళ్ళిపోతాను అందుచేత గర్వంరాకుండా అవినయం రాకుండా కాపాడు అని గోవిందుడుని ఆచార్యుల వారు ప్రార్థించారు.

నిర్వైరః అంటే ప్రపంచం అన్నాక మనకి ఉపకారం చేసేవాళ్ళు ఉంటారు, అపకారం చేసేవాళ్ళు ఉంటారు. అపకారం చేసేవాళ్ళు ఉన్నా వాళ్ళపట్ల వైరం పెట్టుకోవటానికి కారణం ఉన్నప్పటికీ వైరం పెట్టుకోవద్దు. వైరం పెట్టుకుంటే బ్రెయిన్ పొల్యూట్ అయిపోతుంది. మీ మనస్సు బాహ్యముఖం అవుతుంది. ఏసు ఏమన్నాడంటే వాడు ప్రేమిస్తున్నాడు కాబట్టి నువ్వు వాడిని ప్రేమిస్తూ ఉంటే అది సామాన్యమానవులు చేసేపనే కదా కానీ వాళ్ళు ద్వేషించినా నువ్వు ప్రేమిస్తూ ఉంటే నువ్వు భక్తుడవు అవుతావు, యహోవా అనుగ్రహానికి పాత్రుడవు అవుతావు అన్నాడు. మనకి సత్వగుణం ఉన్నప్పుడు సబ్జక్టు అర్థమవుతుంది కాని రజోగుణం, తమోగుణం ఉన్నప్పుడు పుస్తకం చదివినా, సబ్జక్టు విన్నా మనకి అర్థం అవ్వదు. ఎందుచేతనంటే సత్వగుణం ఉన్నప్పుడు మన బ్రెయిన్ గ్రహిస్తుంది. మీకు రజోగుణం, తమోగుణం ఉన్నప్పుడు మీరు చదివినా, విన్నా మీ మెదడు పట్టుకోలేదు. అందుచేత మీకు సత్వగుణం లేకపోతే సత్వగుణాన్ని కల్టివేట్ చేసుకోండి. సత్వగుణం మాత్రమే మీకు ఆత్మజ్ఞానానికి దారి చూపిస్తుంది. రజోగుణం, తమోగుణం ఆత్మజ్ఞానానికి దారి చూపించలేవు.

సర్వభూతేషు అంటే సకల ప్రాణికోటిపట్ల నువ్వు ఎంతో కొంత దయకలిగిఉండు. దైవీసంపద ఎవడికయితే ఉందో వాడు మాత్రమే నా స్వరూపం పొందగలడు అని పరమాత్మ చెప్పాడు. పేదల్ని చూచి మీకున్న దాంట్లో ఎవడయితే సహాయం చేస్తున్నాడో, మీరు భౌతికంగా

సహాయం చేయలేకపోయినా పేదల్ని చూచి ఎవడి హృదయం అయితే ద్రవిస్తోందో, వాళ్ళని చూచి ఎవళ్ళ మనస్సు అయితే కరుగుతోందో వాడు మాత్రమే మహాత్ముడు. మిగతా వాళ్ళందరూ దురాత్ములు అన్నాడు వివేకానంద. మనందరికీ బాగుపడాలనే ఉంది. కానీ మాటలద్వారా, చేతలద్వారా, పనుల ద్వారా మనకి తెలియకుండా లోపల అహంకారం పెంచుకుంటున్నాము. మనం కేవలము ఒకచోట కూర్చుని ధ్యానం చేయటం వలన అహంకారం పోదు. అహంకారాన్ని అలంకరించటం వదులుకోవాలి. దానిని ముస్తాబు చెయ్యకూడదు. మనం మాట్లాడే మాట, మనం చేసేపని అహంకారాన్ని తగ్గించేలా ఉండాలి. మనకి తెలియకుండా అహంకారాన్ని అలంకరించుకుంటున్నాము. దానిని ఊరేగిస్తూ ఉంటే అది ఎలా పోతుంది. ఒకరోజు మీరు ఇంటిదగ్గర చూచుకోండి. ఉదయం మొదలు సాయంత్రందాకా ఎన్నిమాటలు మాట్లాడుతున్నారో లెక్కపెట్టుకోండి. అవసరం ఉండి ఎన్నిమాటలు మాట్లాడుతున్నారు. అహంకారం కోసం ఎన్నిమాటలు మాట్లాడుతున్నారో రేపే చూచుకోండి. అలా మీరు లెక్కేసి చూచుకుంటే అవసరం ఉండి మాట్లాడే మాటలు తక్కువ ఉంటాయి. అహంకారం కోసం మాట్లాడే మాటలు ఎక్కువ ఉంటాయి. అది మీరు అబ్జర్వు చేస్తేనే కాని తెలియదు. దానికి బుద్ధిసూక్ష్మత ఉండాలి. ఈ మాట మాట్లాడాం. ఇది అవసరం ఉందా? అవసరం లేదా? మరి అవసరం లేకపోతే ఎందుకు మాట్లాడుతున్నాం అని విడదీసుకోండి. అహంకారం కోసమే మాట్లాడుతున్నాం అని మీ బుద్ధిసూక్ష్మత వల్ల కనిపెట్టాలి. అలా విడదీసుకుంటే మన స్వభావం ఎలా ఉందో మనకి తెలుస్తుంది. కేవలము ఏదో జపం చేయటం వల్ల, ధ్యానం చేయటం వల్ల అహంకారము పోదు. దైనందినజీవితంలో మనం ఎలా మాట్లాడుతున్నాం, ఎలా ఆలోచిస్తున్నాం. ఆడంబరంగా ఆలోచిస్తున్నామా, నిరాడంబరంగా ఆలోచిస్తున్నామా? ఏదో పని చేస్తున్నాం. ఈ పని అవసరం ఉండి చేస్తున్నామా? మమకారం కోసం చేస్తున్నామా అని మీరు పరిశీలన చేసుకొని, మీ ప్రవర్తనను సరిచేసుకొంటే అహంకారం పోతుంది కాని కుప్పనూర్పులో దూడల్ని తోలేసినట్టు తోలేస్తే అహంకారం పోదు.

ప్రతివాడి జీవితంలో వాడి దేహప్రారబ్ధాన్ని బట్టి ఒక కాలంలో సంతోషం వస్తుంది, ఒక కాలంలో దుఃఖం వస్తుంది. సముద్రంలో అలలు ఎంత సహజమో, రోడ్డుమీద మెరక, పల్లాలు ఎంత సహజమో, శరీరానికి చావుపుట్టుకలు ఎంత సహజమో అలాగే నీ దేహప్రారబ్ధాని బట్టి సంతోషము, దుఃఖము అంత సహజంగా వస్తూంటాయి. ఏకాలంలో సంతోషం రావాలో, ఏకాలంలో దుఃఖం రావాలో అది ఈశ్వరనిర్ణయాన్ని బట్టి వస్తూఉంటుంది. మీకు సంతోషం వస్తే సంతోషించేది మీ అహంకారం, మీకు దుఃఖం వస్తే బాధపడేది మీ అహంకారమే. ఈ రెండింటినీ మీరు తీసుకుంటూ ఉంటే మీ అహంకారం బలిసిపోతుంది. సంతోషం ఒక వికారం, దుఃఖం ఒక వికారం. ఆ రెండూ వికారాలే. ఈ రెండూ అహంకారానికే.

వీటికి మీలోపల ఉన్న చైతన్యానికి ఏమీ సంబంధం లేదు. మీకు అనుకూలమైన పరిస్థితులు వచ్చినప్పుడు సంతోషం లేకుండా ఉంటే, మీకు ప్రతికూల పరిస్థితులు వచ్చినప్పుడు దుఃఖం లేకుండా ఉంటే మీ అహంకారం అణిగిపోతుంది. పౌర్ణమి తరువాత అమావాస్య, అమావాస్య తరువాత పౌర్ణమి ఎలా వస్తాయో అలాగే ప్రకృతిలో ఈ సుఖదుఃఖాలు అంతే సహజంగా వస్తాయి. నువ్వు క్షమాగుణం కలిగి ఉండు. ఏసును శిలువవేసినప్పుడు ఎక్కడా ఆయనలో రియాక్షన్ కనబడదు. ఓ తండ్రీ వారు ఏమి చేస్తున్నారో వారికి తెలియదు, వారిని క్షమించి ఆశీర్వదించు అంటాడు ఏసు. వారిని శపించలేదు, ఆశీర్వదించాడు. అది క్షమాగుణం.

మీ శరీరాన్ని ఏమీ శ్రమ పెట్టనక్కరలేదు. రామనామం సైలెంటుగా చేసుకోండి సరిపోతుంది. రామనామం మనిషిని తొందరగా పవిత్రం చేస్తుంది. లోపల వస్తువు ఉన్నప్పటికి రజోగుణం ఉన్న వాడికీ, తమోగుణం ఉన్నవాడికి అది గోచరించదు. సత్వగుణం ఉన్నవాడికి లోపల ఉన్న సద్వస్తువు గోచరిస్తుంది. అందుచేత డబ్బులేనివాడు డబ్బు ఎలా సంపాదించుకుంటున్నాడో అలాగ నువ్వు కష్టపడి సత్వగుణాన్ని సంపాదించుకోవాలి. మన భక్తులకి మనవి ఏమిటి అంటే టైముని జాగ్రత్తగా మేనేజ్ చేసుకోండి, టైము మేనేజ్‌మెంటు తెలిస్తేకాని మీ హృదయంలో ఈశ్వరుడు ఉన్నా ఆయన స్వరూపం మీకు వ్యక్తం కాదు. ఎందుకూ పనికిరాని కబుర్లు చెప్పకుంటూ మనం రోజుల తరబడి కాలక్షేపం చేస్తున్నాము. అవి ఇహానికి పనికిరావు, పరానికి పనికిరావు. పోనీ మీ స్వార్థానికి పనికివస్తాయా అంటే మీ స్వార్థానికి పనికిరావు. కొంతమంది అన్నం తినేసి ఆ కంచం కూడా తియ్యకుండా పక్క ఇంటిలోకి వెళ్ళి పనికిరాని మాటలు అన్నీ చెబుతారు. పొద్దున్న కంచం మధ్యాహ్నం తీసుకుంటారు. అందుచేత డోంట్ వేస్ట్ యువర్ టైమ్. డోంట్ వేస్ట్ యువర్ ఎనర్జీ. టైముని మేనేజ్ చేసుకున్నవాళ్ళే అభివృద్ధిలోకి వస్తారు. అయితే మీ బిహేవియర్ పేటరన్ అబ్జర్వేషన్‌లో ఉండాలి. ఏదో ఒక గంటసేపు గుడిలోకి వెళ్ళాం అక్కడ అభిషేకం చేసేసాము అని కాకుండా 24 గంటలూ మీ బిహేవియర్ పేటరన్ మీ అబ్జర్వేషన్‌లో ఉండాలి. అప్పుడు మీరు గమ్యాన్ని చేరుకుంటారు. నువ్వు గమ్యాన్ని చేరుకునేవరకూ నీ ముఖాన్ని అస్తమానూ అటూ ఇటూ తిప్పకు. ఎవరైనా దారిలో మిమ్మల్ని పలకరించవచ్చు. పలకరించారని అక్కడ కాలక్షేపం చేయకండి. వారికి సమాధానం చెప్పేసి మీ గమ్యానికి చేరుకునే ప్రయత్నం చేయండి.

యమధర్మరాజు నచికేతుడికి ఎన్నో ఆశలు చూపించాడు. ఎన్ని ఆకర్షణలు చూపించినా నువ్వు చెప్పినవన్నీ నిజమే కానీ అవన్నీ కాలప్రవాహంలో కొట్టుకుపోతాయి. చివరికి మనిషి అనుభవించే భోగాలే రోగలాకింద మారతాయి. అందుచేత నాకు మృత్యువు లేని విద్యను ప్రసాదించు అని నచికేతుడు యమధర్మరాజుని అడిగాడు. కఠోపనిషత్తులో

సారం ఏమిటి అంటే చావులేని సత్‌పదార్థం నీ హృదయంలో ఉంది. శరీరానికి చావు వచ్చే లోపులో నీకు నేను అనేటప్పటికి శరీరం ఎలా గుర్తుకువస్తోందో అలాగ నీకు నేను అనేటప్పటికి నీ హృదయంలో ఉన్న చావులేని సత్‌పదార్థం నీకు గుర్తుకు వస్తే, దాని తాలుక అనుభవం నీకు వస్తే, శరీరం చనిపోయేటప్పుడు కూడా నేను ఉంటాను అనే అనుభవం నీకు వస్తుంది. అంటే శరీరం బతికి ఉండగా చావులేని సద్వస్తువుని ఎవడైతే పట్టుకోగలిగాడో, ఎవడైతే అనుభవైకవేద్యం చేసుకున్నాడో వాడు ఇమ్మోర్టల్ అవుతాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-05-2012, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భగవంతుడి లీల, ఆయన ప్రణాళిక ముందుగా మనకు తెలియదు. ఇది ఇలా జరిగితే బాగుండును, అది అలా జరిగితే బాగుండును అని మనం అనుకొంటాము కాని అది ఎలా జరుగుతుందో మనకు తెలియదు, అదే మాయ. ఇంకో క్షణంలో ఏమి జరుగుతుందో మనకు తెలియదు. జరిగేది అంతా ఈశ్వరసంకల్పం ప్రకారం జరుగుతుంది. శాస్త్రంలో ఏమని చెప్పాడు అంటే మీరు తల్లిదండ్రులను చూడటంమానేసి అక్కడ ఆ కాలేజీ కట్టించాము, ఇక్కడ గుడికట్టించాము, అక్కడ నూతులు తవ్వించాము, అక్కడ పుణ్యకార్యాలు చేసాము అంటే ఆ మాటలకు అర్థం లేదు. తల్లిదండ్రులను చూసిన తరువాత మీరు ఇవన్నీ చేయవచ్చు. అంతేకాని తల్లిదండ్రులను చూడటంమానేసి ఇటువంటి మాటలు చెప్పటం అనవసరం. అంటే మన డ్యూటీ మనం చెయ్యాలి. అందుచేత నీ ధర్మం ఏదో నువ్వు చేసి అదనంగా ఏమైనా మంచి పనులు చెయ్యి అంతేగాని ధర్మాన్ని విడిచిపెట్టి నేను ఏదో మంచి పనులు చేసాను అంటే ఆ మాటల వలన ఉపయోగం లేదు. కొంతమంది ఆ వ్యక్తులు ఇప్పుడు లేకపోయినా వారు చెప్పిన మాటలు జ్ఞాపకం వస్తూ ఉంటాయి. రమణమహర్షి, రామకృష్ణుడు చెప్పిన మాటలు నదులు, సముద్రాలు దాటి ఇతర దేశాలలో కూడా ప్రతిధ్వనించాయి. దీనికి ఆ మాటలలో ఉన్న సత్యం, ఆ మాటలలో ఉన్న పవిత్రత కారణం. మీ బుద్ధి పరిశుద్ధంగా ఉంటే, మీ హృదయం పవిత్రంగా ఉంటే అందులో నుండి వచ్చిన మాటకు మరణం ఉండదు. మన హృదయంలో పవిత్రత లేనప్పుడు ఏదో లౌకికంగా తెలివైన మాటలు మాట్లాడినా వాటికి లైఫ్ ఉండదు. పవిత్రతలో నుండి, ఏకాగ్రతలోనుండి, ప్రవీణతలో నుండి వచ్చిన మాటకు శక్తి వస్తుంది. రామకృష్ణుడికి ఏమీ చదువు లేకపోయినా ఆయన మాటలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. ఎందుచేతనంటే ఆయన హృదయంలో కపటం లేదు, ఆయన హృదయాంతరాళాలలో నుండి వచ్చిన ప్రేమపూరితమైన మాటలు కాబట్టి అవి సజీవంగా ఉన్నాయి.

ఆసక్తి ఉంటే దుఃఖం వస్తుంది, ఆసక్తి ఉంటే భయం వస్తుంది. సర్వఅనర్థాలకు

ఆసక్తే కారణం అని పరమాత్మ చెప్పాడు. దుఃఖం అంటే ఏమిటో నాకు తెలుస్తోంది, భయం అంటే ఏమిటో నాకు తెలుస్తోంది మరి ఆసక్తి అంటే ఏమిటి? కర్మఫలం పట్ల కాంక్ష అంటే కర్మఫలం నేను అనుకొన్నట్లుగానే రావాలి అని నువ్వు అనుకొంటూ ఉంటే అదే ఆసక్తి. కర్మఫల దాత ఈశ్వరుడు. నువ్వు పని చేయటానికి మాత్రమే పనికివస్తావు. దానిఫలితం ఎంత ఇవ్వాలో, ఎలా ఇవ్వాలో, ఎప్పడు ఇవ్వాలో నిర్ణయించేది ఈశ్వరుడు. అది నువ్వు అడిగినా, అడగకపోయినా ఇస్తాడు. అడిగితే ఎక్కువ ఇవ్వడు, అడగనంతమాత్రంచేత తక్కువ ఇవ్వడు. దానియందు మనకు విశ్వాసం లేదు కాబట్టి ఇంతఫలం రావాలి అని కోరుకొంటున్నాము, అదే ఆసక్తి. కర్మఫలం పట్ల ఆసక్తి ఉంటే మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. నీకు ఆసక్తి లేకపోతే మనస్సు అంతర్ముఖమవుతుంది. ఆసక్తి లేనప్పడు భయరహితంగా ఉంటావు. స్వార్థం లేకుండా పనిచేయటం వలన ఫలితం రాదేమో అని మనం అనుకొంటాము కాని మనం చేసే ప్రతి పనికి ఫలితం భగవంతుడు ఇచ్చి తీరతాడు.

నిత్యకర్మలు, నైమిత్తికకర్మలు, కామ్యకర్మలు, నిషిద్ధకర్మలు అని కర్మలను మనం రకరకాలుగా చేస్తాము. నిత్యకర్మలు అంటే మన శరీరం నిలబడటానికి, మన సంసారం సాగటానికి మనం రోజూ చేసే పనులను నిత్యకర్మలు అని చెపుతారు. నైమిత్తిక కర్మలు అంటే ఏదో సందర్భాన్ని బట్టి చేస్తాము. ఎవరో పెళ్ళికి, ఫంక్షన్‌లకు పిలిస్తే వెళతాము అంటే ఏదో నిమిత్తమాత్రంగా వచ్చే పనులను నైమిత్తికకర్మలు అంటారు. కామ్యకర్మలు అంటే మనకు అవసరం లేకపోయినా కేవలం కోరికలతో చేసే కర్మలను కామ్యకర్మలు అంటారు. నిత్యకర్మలు ఎలాగూ తప్పవు. గృహస్థులకు నైమిత్తిక కర్మలు కూడా తప్పవు ఎందుచేతనంటే మనిషి సంఘజీవి. అయితే కామ్యకర్మలను తగ్గించుకోమని శాస్త్రంలో చెప్పారు. స్వార్థమే పరమార్థం అనుకునేవారు చేసే పనులలో కామ్యకర్మలే ఎక్కువ ఉంటాయి. కీర్తి కాంక్ష కోసం చేసేపని కూడా కామ్యకర్మే. మనం కేవలం పని, పనికోసమే చేస్తే అది కామ్యకర్మ కాదు, అది నిష్కామకర్మ అవుతుంది. నిష్కామకర్మ కూడా ఒక యోగం. డబ్బు సంపాదించటం కంటే, విద్య సంపాదించటంకంటే పూర్వజన్మల నుండి వస్తున్న వాసనలను నాశనం చేసుకోవటం చాలా కష్టం. కర్మను యోగంగా చేస్తే వాసనాక్షయం అవుతుంది. నిష్కామ కర్మ కూడా వాసనాక్షయానికి సహకరిస్తుంది. కర్మఫలం పట్ల ఆసక్తి లేకపోతే అసలు మనస్సు చలించదు. నిష్కామకర్మ అంటే కోరిక లేకుండా పనిచేయటం. భగవాన్ ఒకమాట చెప్పారు భగవంతుడు అడిగినవాడికి అడిగినదే ఇస్తాడు, ఏమీ అడగనివాడికి అన్నీ ఇచ్చి, చివరకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు అని చెప్పారు.

కొంతమంది భగవంతుడు చెప్పిన మాటలను సైన్స్‌తో పోలుస్తారు. భగవద్గీతను తీసుకొని వెళ్ళి సైన్స్‌తో పోలిస్తే అది భగవంతుడిని అవమానపరచినట్లు అని వారికి తెలియదు.

సైన్స్ అనేది నీ బుద్ధికి సంబంధించినది. తాత్కాలికంగా అది నిజంలాగ అనిపిస్తుంది. కాల ప్రవాహంలో దానిని తీసి అవతల పడేస్తారు, అది కలకాలం నిలబడదు. నీ బుద్ధి చెప్పింది ఏదీ నిజంకాదు. నీ హృదయంలో ఉన్న పరమాత్మ చెప్పింది మాత్రమే సత్యం. అందుకే దానిని భగవాన్ ఉవాచ అంటారు, దీనిని మనం మర్చిపోకూడదు. నిషిద్ధకర్మలు అంటే భగవంతుడు భగవద్గీతలో ఏ పని మనల్ని చేయవద్దు అని చెప్పాడో ఆ పనులను మనం వదులుకోవాలి. పనిచెయ్యటం నీవంతు. కష్టపడుతున్నాము ఏమీ కలిసిరావటంలేదు అంటే వస్తుందో రాదో అది వేరేవిషయం, నీ డ్యూటీ నువ్వు చెయ్యాలి. మీ అమ్మ మెడలో గొలుసులు లేకపోతే మీరు మొత్తానికి ఆమెను చూడటం వదిలేయకూడదు. మీ అమ్మపట్ల నీ డ్యూటీ నువ్వు చెయ్యాలి, భగవంతుడు చెప్పాడు కాబట్టి ఆమెను చూడాలి. భగవంతుడు చెప్పాడు కాబట్టి ఆ పని మనకు ఇష్టం లేకపోయినా అది చెయ్యాలి. భగవంతుడు ఏ పని అయితే వద్దు అని చెప్పాడో అది మనకు ఎంత ఇష్టం అయినా ఆ పని చేయకూడదు. భగవంతుడు చెయ్యమని చెప్పిన కర్మను చేయటం అది మన డ్యూటీ. మనకు ఇష్టంలేకపోయినా భగవంతుడు చెప్పాడు కాబట్టి ఆ పని చెయ్యటం వలన అది మనలను మహోన్నతమైన స్థితికి తీసుకొనిపోతుంది. ఒక పని నీకు మంచి పని కింద అనిపించినా భగవంతుడు ఆ పని వద్దు అంటే దానిని వదిలేయాలి. ఎందుచేతనంటే నీ తెలివితేటలకు భగవంతుడు చెప్పింది అర్థం కాదు. మనం చెయ్యవలసిన పని మానకూడదు, చెయ్యకూడని పని చెయ్యకూడదు. ఏది చెయ్యాలి, ఏది చెయ్యకూడదు అని నిర్ణయించేది నీ బుద్ధికాదు, అది పరమాత్మ చెప్పాలి.

ఏ మనిషి అయినా ప్రారబ్ధం అనుభవించాలి అని శాస్త్రం చెపుతోంది. దీనికి భగవాన్ ఏమన్నారు అంటే మనస్సు బాహ్యముఖం అయిన వాడికి ప్రారబ్ధం కాని, మనస్సు అంతర్ముఖం అయినవాడికి ప్రారబ్ధం ఏమిటి, ఏమీ లేదు అన్నారు. అయితే మనస్సును ఎవడు అంతర్ముఖం చేయగలడు అంటే అది ఒక్క గురువుకే సాధ్యం. గురువు అంటే ఆ శరీరానికి సంబంధించిన వాడు కాదు, గురువు అంటే ఆత్మ, జీవన్ముక్తి అంటే ఈ శరీరంలో ఉండగానే వారు ముక్తి స్థితిని పొంది ఉంటారు, ఈ తనువు తాను కాదని వారికి తెలుస్తూ ఉంటుంది. రమణ భగవాన్, రామకృష్ణపరమహంస జీవన్ముక్త స్థితిని పొందారు. విదేహముక్తి అంటే ఆ దేహాన్ని ప్రాణం విడిచిపెట్టే టైములో వారు ముక్తిని పొందుతారు, త్యాగరాజు అలా పొందారు. ఇంక క్రమముక్తి అంటే కొంతమందికి మరణించే టైములో చిన్నచిన్నవాసనలు మిగిలిపోయి ఉంటాయి. ఈ చిన్నవాసనలకోసం మరల వారికి దేహం ఇవ్వటం ఎందుకని భగవంతుడు ఏమి చేస్తాడు అంటే సూక్ష్మలోకాలలో ఆ చిన్న దోషాలను అనుభవింపచేసి వారికి ముక్తిని ప్రసాదిస్తాడు, అది క్రమముక్తి. నువ్వు ఆసక్తి లేకుండా పనిచేయటం నేర్చుకుంటే అనాసక్తి అలవాటు అయిపోతుంది. అప్పుడు సుఖం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. అప్పుడు

సుఖంకోసం, శాంతికోసం నీవు బయట వ్యక్తులమీదగాని, పరిస్థితులమీదగాని ఆధారపడ నక్కరలేదు. గాంధీగారు భగవద్గీతకు అనాసక్తి యోగం అని పేరు పెట్టారు. నువ్వు ఆసక్తి లేకుండా జీవించటం వలన, కర్మఫలం పట్ల ఆసక్తి లేకుండా ఉండటం వలన నువ్వు భయరహితుడవు అవుతావు అంటే అభయస్థితిని పొందుతావు.

మేము అది సాధించాము, ఇది సాధించాము అని కొంతమంది చెపుతూ ఉంటారు. వీడు ఏదైనా సాధించగలడా? ఈశ్వరుడు సాధించి పెట్టింది నేను సాధించాను అంటాడు. నేను అది సాధించాను, ఇది సాధించాను అని నువ్వు అనుకొంటూ ఉంటే అదే కర్తృత్వం, అదే నీ దు:ఖానికి కారణం. ఏవో బాహ్యకారణాల వలన దు:ఖం వచ్చింది అని అనుకొంటాము కాని మన దు:ఖానికి కర్తృత్వమే కారణం. వాడి శరీరం తోటో, మనస్సుతోటో, తెలివితోటో ఇలా వాడు కానిదానితో తాదాప్యం పొందుతూ ఉంటాడు, దానివలన కూడా దు:ఖం వస్తుంది. వాళ్ళు మావారు అంటున్నావు. నీ శరీరమే నీదికానప్పుడు ఎవరు నీవారు. ఆచార్యులవారు ఏమన్నారు అంటే ఎవరూ ఎవరికీ ఏమీకారు, ఇవి అన్నీ మనస్సు యొక్క కల్పితాలు అని చెప్పారు ఇది మీరు బాగా గుర్తు పెట్టుకోండి. మనం బాగుపడాలంటే ఒకటి నేర్చుకోవాలి. మన ఇంట్లో గొడవలను కాని, సంఘంలోనుండి వచ్చే గొడవలను కాని మనం లోపలకు తీసుకోకూడదు. మామిడిపండు టెంకను నాకినట్లుగా మనం ప్రపంచంలోని విషయాలను నాకటం నేర్చుకొన్నాము. ఇలా ఏదో ఒక విషయాన్ని నాకుతూ ఏదో రోజున చనిపోతున్నాము. కర్మఫల కాంక్షవద్దు అని పరమాత్మ చెపుతున్నాడు. కర్మఫలం పట్ల కాంక్ష వద్దు అని చెపుతున్నాను కాబట్టి అసలు కర్మ చెయ్యటం యందే విరక్తి పెట్టుకోవద్దు. నువ్వు ఏమీ పనిచెయ్యవు అనుకో నీకు అసలు పొట్ట ఎలా వెళుతుంది. పని మిమ్మల్ని విడిచిపెట్టాలి కాని మీరు పనిని విడిచిపెట్టకూడదు. సర్వకాల సర్వఅవస్థలలో కర్మఫలం పట్ల అపేక్ష వద్దు. నీశరీరం ఉన్నా లేకపోయినా స్వప్నంలో కూడా ఆశించవద్దు. కర్మఫలానికి నువ్వు కారణం కావద్దు. ఒకవేళ కర్మఫలం నీకు వచ్చినా అది నేనే సాధించాను అని అనుకోవద్దు. నేనే సాధించాను అనుకొంటే కర్మఫలానికి నువ్వు కారణం అవుతున్నావు కాబట్టి మరల ఆకర్మ నిన్ను చుట్టుకొంటుంది, నువ్వు దానిని అనుభవించాలి. మీ అమ్మను చూడాలి కాబట్టి చూడు. నీకోరికతో సంబంధం లేకుండా మీ అమ్మ నీకు ఏదైనా ఇస్తే తీసుకో, అందులో దోషం లేదు. అడిగి పుచ్చుకొంటే దానివలన దోషం వస్తుంది.

రావణాసురుడిని చంపటానికి రాముడు, కంసుడిని చంపటానికి కృష్ణుడు ఇలా రాక్షససంహారం కోసం భగవంతుడు అనేక అవతారాలలో వచ్చాడు. మనం రాక్షసులం కాకపోయినా రాక్షసగుణాలు మనలో ఉన్నాయి. దైవసహాయం లేకుండా ఈ గుణాలలో నుండి మనం బయటకు రాలేము. వాసనా క్షయంకోసం మనం ఏదో ప్రయత్నం చేస్తున్నాము

కాని ఫెయిల్ అయిపోతున్నాము. రాక్షససంహారం కోసం రామావతారం, కృష్ణావతారం ఎలా వచ్చాయో అలాగే ఆచార్యపురుషులు, గురువులు ఈ భూమికి వచ్చి మనకి సహాయం చేస్తేనే కాని మనలో ఉన్న రాక్షసగుణాలను బయటకు లాగి కాల్చి బూడిద చేయలేము. వారి సహాయం లేకపోతే ఒకవేళ మనం ప్రయత్నం చేసినా కేవలం మన తెలివితేటల వలన వాటిలోనుండి మనం విడుదల పొందలేము. సమానబుద్ధికలవాడు అంటే నిష్కామకర్మ చేసేవాడు చనిపోయిన తరువాత జీవుడు ప్రయాణం చేసేటప్పుడు పుణ్యపాపములను వాడి కూడా పట్టుకొని వెళ్లడు, వాటిని ఈ భూమిమీదే వదిలేసి వెళ్లిపోతాడు. ఎందుచేతనంటే పుణ్యంవాడికి అక్కరలేదు, పాపం వాడికి అక్కరలేదు, పుణ్యం, పాపం రెండూ కూడా మనిషిని బంధిస్తాయి. ఫలాసక్తి ఉన్నవాడు పుణ్యపాపములను కూడా పట్టుకొనివెళతాడు. కాని ఫలాసక్తి లేనివాడికి వాటితోపనిలేదు, వాటిని ఈ భూమిమీదే వదిలేస్తాడు.

గురునానక్ ఏమన్నాడు అంటే నీకు వందకోట్లు డబ్బు ఉండవచ్చు, ఆ డబ్బు మాట వదిలెయ్యి. ప్రాణంపోయి ఈలోకాన్ని విడిచిపెట్టి పరలోకానికి వెళ్లేయాత్రలో కనీసం నీ ఇంటి దగ్గర ఉన్న గుండెసూదిని అయినా నువ్వు కూడా పట్టుకొనివెళ్లగలవా అని అడిగాడు. భగవాన్‌ను ఒక భక్తుడు ప్రశ్న అడిగాడు, లోపల పరమాత్మ ఉన్నాడోలేడో కాని మనకు దేహం ఒకటి కనిపిస్తోంది, ఈ ప్రపంచం మన కళ్లకు కనిపిస్తోంది, వీటివలన ఏమైనా ప్రయోజనం ఉందా అని అడిగాడు, ప్రయోజనం ఉంది అని చెప్పారు. దేహం చనిపోయేలోపులో అంటే ఈ దేహం ప్రపంచంలో ఉండగానే అంటే నీ ముక్కులో గాలి తిరుగుతున్నప్పడే ఈ దేహాన్ని, ఈ ప్రపంచాన్ని ఉపయోగించుకొని నీ హృదయంలో అంతర్యామిగా ఉన్న పరమాత్మను దర్శించటమే ఈ దేహం యొక్క ప్రయోజనం, ఈ లోకం యొక్క ప్రయోజనం. స్వరూప జ్ఞానాన్ని పొందటానికి ఈ దేహాన్ని ఉపయోగించుకోవాలి. తనని తాను తెలుసుకున్నవాడు జ్ఞాని, తనని తాను తెలుసుకోకుండా వాడు ఎన్ని విషయాలు తెలుసుకొన్నావాడు అజ్ఞానే. అంటే నువ్వు ఎవరివో నువ్వు తెలుసుకోకుండా, నీ స్వరూప జ్ఞానం సంపాదించకుండా మిగతావి ఎన్ని సంపాదించినా అవి ఒకటి లేని సున్నలతో సమానము. షేక్స్‌ఫియర్ ఏమన్నాడు అంటే మీరు వెయ్యికోట్లు సంపాదించినట్లు కల వచ్చింది అనుకోండి. మెలకువ వచ్చాక ఆ వెయ్యికోట్ల కోసం వెతుక్కొంటారా, లేదు. ఎందుకు వెతుక్కోవటం లేదు అంటే అది అబద్ధం అని మీకు తెలిసిపోయింది. అలాగే మీకు ఆత్మానుభవం కలిగితే ఈ జాగ్రదవస్థలో మీకు ఉన్న కోట్ల రూపాయలు కూడా అంతే. నీకు స్వప్నంలో జరిగే సంఘటనలు ఎంత నిజమో ఈ జాగ్రదవస్థలో జరిగే సంఘటనలు కూడా అంతే నిజం. అయితే ఆ స్వప్నం పొట్టిగా ఉంటుంది, ఈ స్వప్నం పొడుగ్గా ఉంటుంది. చివరకు నీ శరీరానికి సంబంధించిన చావు కూడా అబద్ధమే ఎందుచేతనంటే నీ స్వరూపానికి చావు లేదు.

రెండవ అధ్యాయంలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు, ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు, ఉన్నదిపోదు లేనిది రాదు అని చెపుతూ మనం అనుమానం మనుషులం అని ఆయనకు తెలుసుకాబట్టి చివరలో ఏమన్నాడు అంటే మీరు నమ్మిన, నమ్మకపోయినా ఇది నిశ్చయం అన్నాడు. నువ్వు అసలు లేవు. లేనిదానిని ఉంది అనుకొంటున్నావు. ఇప్పడు నువ్వు నేను, నేను అంటున్నావు కదా. ఆ నేను నిజంగా లేదు. కాని ఉంది అనుకొంటున్నావు కదా. లేనిదానిని ఉంది అనుకొంటున్నావు కాబట్టి ఆ నేనుకే ఈ బోధ. ఆ నేను లేదని నీకు తెలుస్తుంది అనుకో అప్పడు ఉన్నది ఒక్కటే. అన్నం తినాలి అంటే ఆకలి ఉండాలి. ఆకలి లేకుండా అన్నం ఎలా తింటారు. మీకు దాహంగా ఉంటే మంచినీళ్ళు కావాలి అంటారు. దాహం లేకపోతే మంచినీళ్ళు వద్దు అంటారు. అలాగే జిజ్ఞాస ఉన్నవాడికి జ్ఞానం కావాలి కాని జిజ్ఞాస లేనివాడికి జ్ఞానం గురించి చెప్పినా వాడు వినడు. జ్ఞానం సంపాదించాలనే అపేక్ష ఉంటే మీకు జ్ఞానం వచ్చేస్తుంది. ఈ మధ్యన ఒక మిత్రుడు నా దగ్గర మీ భగవాన్ టీచింగ్ కంప్లీట్ టీచింగ్ కాదు అన్నారు. నేను ఆయనతో వాదనలోకి దిగలేదు. రమణభగవాన్ టీచింగ్ జ్ఞానయోగం పట్ల ఇష్టం ఉన్నవారికే నచ్చుతుంది కాని జ్ఞానమార్గంలో లేనివారికి అయన టీచింగ్ నచ్చదు.

మనం చేసే పనిని ఓర్పుగా, నేర్పుగా చేయాలి, చేసే పనియందు మనస్సు పెట్టి చేయాలి, పెర్ఫెక్టుగా చెయ్యాలి, అక్కడ కంప్లీట్‌నెస్ ఉండాలి, అది కూడా యోగం. ఫలకాంక్ష పట్ల ఆసక్తి లేకుండా చేయటం కూడా యోగం. ఫలకాంక్ష పట్ల ఆసక్తి లేకపోయినా ఫలం వస్తుంది, అది మీకు తెలియకపోవటం వలన దానిపట్ల కాంక్ష పెట్టుకొంటున్నారు. ఆ పని చేసేటప్పడు పుణ్యపాపములు మీకు తగులుకోకుండా చెయ్యాలి. అంటే ఆ పని చేయటం వలన మీకు పుణ్యం అంటుకోకూడదు, పాపం అంటుకోకూడదు, రెండూ అంటుకోకుండా చెయ్యాలి. ఇదంతా కలిపితే కర్మని యోగంగా చెయ్యటం. కర్మను యోగంగా చెయ్యటంవలన ఆ కర్మ నిన్ను బంధించదు, వాసనాక్షయం అవుతుంది, అంటే కొత్త వాసనలు రావు, పాత వాసనలు పోతాయి. మీకు డబ్బు ఉంది, బంగారం ఉంది, అన్నీ ఉన్నాయి, కాని మనస్సులో శాంతిలేదు అనుకోండి వీటివలన ప్రయోజనం ఏముంది. మీకు ఎన్ని ఉన్నా శాంతి లేని వాడికి సుఖం లేదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 13-06-2012, గుండుగొలను)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మౌనం అంటే నోరుమూసుకొని కూర్చోవటంకాదు, ఎక్కడయితే మనస్సు నిశ్శేషంగా అణిగిపోయిందో అక్కడనుండి మౌనం వస్తుంది, అది ఆత్మకు సంబంధించినది. మౌనం చాలా శక్తివంతమైనది, అది మీకు ఉపదేశం చేస్తుంది. అది సైలెంట్‌గా పనిచేస్తుంది.

మీరు ఆత్మజ్ఞానం పొందితే మీద్వారా లోకానికి జరిగే మేలు, లోకానికి జరిగే మంచి ప్రపంచంలో ఎవరి వలన జరగదు. మీరు ఏదిగా ఉన్నారో ఆస్థానాన్ని జ్ఞాని పొందుతాడు కాబట్టి ఆయనద్వారా శాంతి, ఆనందం ప్రవహిస్తాయి. ఐశ్వర్యం అంటే జ్ఞానమే ఐశ్వర్యం, జ్ఞానానికి మించిన సంపదలేదు. భగవంతుడు సకల ఐశ్వర్యవంతుడు. మీరు అందరూ రూపరహితులే, నామరహితులే అయినా మీరు ఏదో రూపంతోటి, ఏదో నామంతోటి తాదాప్యం పొందుతున్నారు. ఈరూపబుద్ధి, నామబుద్ధి పోవటానికి అవతారపురుషులలో ఏదో రూపాన్ని, లేదా నామాన్ని తీసుకొని ఆరూపాన్ని ధ్యానం చేస్తూ, ఆనామాన్ని స్మరిస్తూ ఉంటే మన రూపబుద్ధిలోనుండి, నామబుద్ధిలో నుండి బయటకు వచ్చేస్తాము. భగవంతుడి యొక్క కళ్యాణ గుణాలను తలపెట్టుకొంటూ ఉంటే చెడ్డ గుణాలు మన దగ్గరకు రావు. భగవంతుడు చేసిన కర్మలను జ్ఞాపకం పెట్టుకొంటే ఇంక మనం చెడు కర్మలను చెయ్యం. అందుకే మన పెద్దలు దేవాలయాలను ఏర్పాటు చేసారు, అయితే మనం వాటిని ఉపయోగించుకోవాలి. అలాగే మన శరీరాలను కూడా ఉపయోగించుకోవాలి. కామాగ్నిలోనుండి ఈ శరీరాలు పుట్టాయి, చివరకు చితాగ్నిలో కాలిబూడిద అయిపోతాయి. ఈ లోపుగా ప్రారబ్ధాన్ని బట్టి శరీరయాత్ర సాగుతూ ఉంటుంది. ప్రారబ్ధం లేకుండా అసలు శరీరంరాదు. కామాగ్నిలోనుండి వచ్చిన ఈ శరీరం చితాగ్నిలో కాలిబూడిద అవ్వకముందే ఓ అరుణాచలేశ్వరుడా! నీ జ్ఞానాగ్నిని పంపించి నాలో ఉన్న అజ్ఞానాన్ని కాల్చిబూడిద చెయ్యి అంటే నాలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి నీ స్వరూపాన్ని నాకు ప్రసాదించు.

పొగడ్తలను, విమర్శలను భక్తులు పట్టించుకోకూడదు. ఇవి అన్నీ ప్రకృతిగుణాలు. మనం సాధన చేసి ఈ ప్రకృతిగుణాలను దాటాలి. దేహాన్ని, మనస్సును మనం మేగ్జిమమ్ ఉపయోగించుకోవాలి. మనకు కాలం విలువ తెలియటంలేదు అందుచేత కాలాన్ని పాడుచేసుకొంటున్నాము. భగవంతుడు కాలరూపంలో ఉన్నాడు. మనం కాలాన్ని సద్వినియోగం చేసుకొంటే భగవంతుడిని గౌరవించినట్లు అవుతుంది. పూర్వం పండితులను తీసుకొనివచ్చి దేవాలయాలలో పురాణాలు చెప్పించేవారు. అవి వినటంవలన కొంతమంది బాగుపడతారు అని అలా చేసేవారు. శ్రవణం చేయాలి, శ్రవణం చేయకపోతే మనకు ఎలా తెలుస్తుంది. తంజావూరు మహారాజుగారు ఎప్పుడయినా అవకాశం ఉన్నప్పుడు త్యాగరాజుగారి తండ్రిని పిలిపించి రామాయణం చెప్పించుకొనేవారు. రాజుగారికి రామాయణం చెప్పటానికి వెళుతున్నాను నువ్వు కూడా వస్తావా అని కొడుకుని అడిగేవాడు. నేను కూడా వస్తాను అని త్యాగరాజు, తండ్రిగారితో వెళ్ళిరాజుగారికి రామాయణం చెప్పేటప్పుడు ఈయన కూడా వినేవాడు. రాముడికి యిన్ని మంచిగుణాలు ఉన్నాయి, మనం కూడా ఈ గుణాలను సంపాదించుకోవాలి అనుకొనేవాడు. రాముడి యొక్క కళ్యాణగుణాలను శ్రవణం చేశాడు, మననం చేశాడు. ఆయనకు జ్ఞానసంపద ఎప్పుడయితే కలిగిందో, భౌతికసంపద మీద పూర్తిగా ఆకర్షణ

పోయింది. త్యాగరాజు గురించి రమణభగవాన్ ఏమన్నారు అంటే ఆయన పాటలు పాడి పొందలేదు, పొందవలసిన ఆత్మజ్ఞానం పొందే ఆయన పాటలు పాడారు అని చెప్పారు.

భవిష్యత్‌లో ఏది మనకు ఉపయోగపడుతుంది, ఏది మనకు ఉపయోగపడదు, ఏది మనకు మంచి చేస్తుంది, ఏది మనకు చెడ్డచేస్తుంది, అనే పరిశీలన, ముందు చూపు మనకు ఉండాలి. అంతేగాని యిప్పుడు తాత్కాలికంగా పొందేది చూసుకోకూడదు. ఈరోజు బాగానే గడిచిపోయింది అనుకోవద్దు, గమ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. మీరు సత్వగుణాన్ని ప్రాక్టీసు చేయండి. దానివలన తమోగుణంలో నుండి రజోగుణంలోనుండి బయటకు వచ్చేస్తారు. సత్వగుణం కూడా గుణమే అయితే అది నువ్వు మోక్షాన్ని పొందే మార్గాన్ని చూపించి ప్రక్కకు తప్పుకొంటుంది. మనం మంచిపనులు చేయాలి, అందరిచేత గౌరవింపబడాలి అని కొంతమంది మంచిపనులు చేస్తూ ఉంటారు. అంటే వారు సత్వగుణాన్ని దాటలేదు. మనం ఈమూడు గుణాలు దాటిన తరువాత మీ శరీరం కొంతకాలం ఉన్నా దీనిని భాగవతంలో ఏమని చెప్పాడు అంటే బాగా సారా తాగిన వాడికి ఆమత్తులో వాడి శరీరం మీద బట్ట ఉందో లేదో వాడికి తెలియదు అలాగే ఈ మూడుగుణాలు దాటినవాడికి, జీవన్ముక్తుడు అయిన వాడికి శరీరం ఉందో లేదో వాడికి తెలియదు. ఆ శరీరానికి ప్రారబ్దం ఉంది కాబట్టి ప్రారబ్దం ఉన్నంతకాలం ఆ శరీరం ఉండి తరువాత చనిపోతుంది అంతేగాని వాడికి శరీరం గొడవ ఉండదు. ఎవడైతే ఈ మూడు గుణాలను దాటాడో వాడు నా స్వరూపాన్ని పొందుతాడు అని పరమాత్మ చెప్పాడు అంటే అక్కడ ఆయన శరీరం అనికాదు, ఆయన స్వరూపం అయిన బ్రహ్మంను పొందుతాడు. శాస్త్రం ఏమని చెపుతోంది అంటే ఈ శరీరాలు తల్లితండ్రుల కామాగ్నిలోనుండి పుట్టినా ఈ శరీరాలను పాడుచేసుకోవద్దు, ఈ శరీరాలను మూడు గుణాలను దాటటానికి ఉపయోగించుకోండి, తరువాత మీ శరీరాలు చితాగ్నికి ఆహుతి అయిపోయినా ఫరవాలేదు ఎందుచేతనంటే ఈ లోపుగా మీరు ప్రకృతిని దాటేసారు కాబట్టి ఇంక మీకు శరీరాలతో పనిలేదు, అదే కడసారి జన్మ, ఇదీ రహస్యం. కామాగ్నిలో నుండి వచ్చిన ఈ శరీరాన్ని చివరి శరీరంగా ఉపయోగించుకోమని శాస్త్రం చెపుతోంది. కామక్రోధాలు, లోభిత్వం, మదం ఇవి ఏమీ లేనివాడికి శరీరంతో పని ఏముంది, మహాజ్ఞాని శరీరాన్ని ఏమిచేసుకొంటాడు. మాకు శరీరాలు ఆగిపోవాలి అని అనుకొంటే శరీరాలు రావటం ఆగిపోవు, వాటి అవసరం మనకు లేనప్పుడు ఇంక మనకు శరీరాలు రావు. భగవంతుడు మీ హృదయంలోనే ఉన్నాడు. మన మాటలకు ఆయన మోసపోడు. మనలో ఏ బలహీనతలు ఉన్నాయో చూస్తూ ఉంటాడు. మనలో ఉన్న గుణాలను మనం తొలగించుకోలేము. జ్ఞానాగ్ని వచ్చి అందులో ఆ గుణాలు కాలిబూడిద అవ్వాలి కాని వాటిని బయటకు గెంటటానికి మనకు ఉన్న శక్తి సరిపోదు.

జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ ఈ మూడు అవస్థలు బుద్ధికి సంబంధించినవి, ఆత్మకు సంబంధించినవి కాదు. మూడు గుణాలు కూడా బుద్ధికి సంబంధించినవి, ఆత్మకు వీటితో ఏమీ సంబంధం లేదు. ఈమూడు అవస్థలలోనుండి, మూడు గుణాలలోనుండి మనం బయటకు రావాలి. దీనికి పరమాత్మ ఏమని చెప్పాడు అంటే కేవలం మీరు చేసే సాధనలవలన, మీతెలివితేటలవలన, మీ గుణాలవలన వీటిలోనుండి మీరు బయటకు రాలేరు. నా పాదాలుయందు భక్తి కలిగి ఉండండి. ఆభక్తి మాత్రమే, ఆప్రేమ మాత్రమే వీటిలో నుండి మిమ్మల్ని దాటిస్తుంది కాని వేరే మార్గాంతరంలేదు. మీకు భగవంతుడి మీద అకారణభక్తి కలగాలి. మీకు ఏదైనా కోరిక ఉండి ఈశ్వరుడిని ప్రార్థిస్తే అందులో పొరపాటులేదు కాని దానివలన మీరు గుణాలను దాటిపోలేరు, మీభక్తి ఆకోరికకే పరిమితం అవుతుంది. మీరు భగవంతుడి పట్ల అకారణభక్తి కలిగిఉంటే ఈమూడు అవస్థలను, మూడు గుణాలను దాటి అమృతత్వంను పొందుతారు. మేఘాలు అన్నీ గాలిస్వాధీనంలో ఉన్నాయి, గాలి ఎటుగెంటేస్తే మేఘం అటు వెళ్ళిపోతుంది. అలాగే ఈ ప్రాణాలన్నీ కాలం స్వాదీనంలో ఉన్నాయి. ఆటైము వచ్చినప్పుడు మన శరీరం కూడా వెళ్ళిపోతుంది, దానిని మనం ఆపుచేయలేము. మనకు చావురాదు అని ఎవరూ అనుకోవద్దు. శరీరం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాము. నేను చనిపోతున్నాను అనుకొనే వాళ్ళంతా తిరిగి పుడతారు. అంటే మరల శరీరం వస్తుంది. శరీరం పోతోంది కాని నేను పోవటంలేదు, నేను ఉన్నాను అనే అనుభవం మనకు రావాలి, అదే అమృతత్వం. మీకు ఎంతో కొంతభక్తి ఉంది కాని ఆభక్తి కోరికలకే పరిమితం, మీకు ఎంతో కొంత ప్రేమ ఉంది, కాని ఆప్రేమ మీ కుటుంబానికే పరిమితం. మహాత్ముల యొక్క ప్రేమ అది ఒక ప్రాంతానికి, ఒక దేశానికి పరిమితంకాదు, అది యూనివర్సలే లవ్.

మూడురకాల విద్యలు ఇందులో 1.పొట్ట పోషించుకోవటానికి మనం ఏదో ఒకటి చేయాలి కదా. వ్యవసాయం చేయటం, ఉద్యోగం చేయటం ఇలా ఏదో ఒకటి చేయాలి. అదో రకమైన విద్య. దీనివలన పొట్ట వెళ్ళిపోతుంది. 2.మనం సమాజంతో ఎలా నడుచుకోవాలి అనేది అంటే ఇది ప్రవర్తనకు సంబంధించినది విద్య. మనిషి అయ్యాక సమాజంతో సంబంధం లేకుండా మనం బతకలేము. ఏమనుషులతో ఎలా ప్రవర్తించాలి, మనం ఏగుణాలకు దూరంగా ఉండాలి, ఎవరితో సహవాసం చెయ్యాలి అనేది నేర్చుకోవాలి. శరీరం ఉన్నంతసేపు సమాజంతో ఎంతో కొంత సంబంధం తప్పదు. మనం పొట్టకోసం చదివే చదువులకు, ప్రవర్తనకు ఏమీ సంబంధం లేదు. కొంతమంది లోపల కోపం ఉన్నా కామ్‌గా, క్వయిట్‌గా మాట్లాడతారు అంటే వారు తెలివైనవారు. మనకు ఎవరి మీద అయినా కోపం ఉన్నా మామూలుగా వారు కలిస్తే మాట్లాడాలి అంతేగాని ముఖం ప్రక్కకు పెట్టుకోకూడదు. మీరు లోపల కోపంతో కాలిపోతున్నా మాట్లాడేటప్పుడు సత్వగుణంతో

మాట్లాడాలి, అప్పుడు లోపల ఉన్న కోపాగ్ని నెమ్మదిగా చల్లారిపోతుంది. మనం నోరు తెరిస్తే తింగర మాటలు వచ్చేస్తాయి, చెడ్డమాటలు వచ్చేస్తాయి అనుకొన్నప్పుడు మనం మౌనంగా ఉండటం మంచిది. మౌనంగా ఉండటం వలన కూడా కొన్ని సమస్యలు పరిష్కారం అయిపోతాయి. 3.ఆత్మవిద్య అంటే మనం ఆత్మానుభవం పొందాలి. అది ఫైనల్.

మీరు రామరామ అంటున్నారు, కృష్ణా వాసుదేవా మాధవా అంటున్నారు. మీరు ఆనామం జపించేటప్పుడు యాంత్రికంగా చేస్తున్నారా లేక ప్రేమపూరితంగా చేస్తున్నారా అని మీరు యింటికి వెళ్ళి పరిశీలన చేసుకోండి. మీమనవడిని పిలిచేటప్పుడు ఏరాబుజ్జీ అంటారు. ఆబుజ్జీ అన్నప్పుడు ఉన్నంత ప్రేమ, దైవనామం చేసేటప్పుడు మీకు ఉందా అనేది భగవంతుడు చూస్తాడు. రాముడే దేవుడు, కృష్ణుడే దేవుడు, వాడు గుడిలోనే ఉంటాడు, మన ఇంటి దగ్గరలేడు అని అనుకోవద్దు. ఆయన అంతర్యామి, ఆయన మన హృదయంలోనే ఉన్నాడు. మీకు మంచితలంపు వచ్చినా చెడుతలంపు వచ్చినా అంతర్యామికి తెలియకుండా ఎలా ఉంటుంది. భగవంతుడు ఎక్కడో కాశీలో ఉన్నాడు, రామేశ్వరంలో ఉన్నాడు అనే గొడవలో పడిపోయాము. కాని ఆయన మన హృదయంలోనే అంతర్యామిగా ఉన్నాడు.

మీరు ఎక్కడా ఆసక్తి పెట్టుకోవద్దు. ప్రారబ్దాన్ని బట్టి వచ్చేది ఏదో వస్తుంది. వచ్చేదానిని మీరు ఆపుచేయలేరు, రానిది ప్రయత్నం చేసినా రాదు. ఈరాగాలు, ద్వేషాలు, అసూయలు ఇవి అన్నీ మనస్సులో వచ్చే వికారాలు. నువ్వు బయట ఏదో సాధించేయాలి అనుకొంటున్నావు. నువ్వు ముందు సాధన చేసి ఈ వికారాల నుండి బయటకురా, ఇవన్నీ మీకు తెలుస్తున్నాయి కదా. ముందు ఈ వికారాల నుండి బయటపడు, అదే నువ్వు చేయవలసిన ముఖ్యమైన సాధన. ఇక్కడ సీక్రెట్ ఏమిటి అంటే ఈ వికారాల నుండి బయటపడటానికి నీ తెలివితేటలు సరిపోవు. నీకు డబ్బు ఉండవచ్చు, తెలివి ఉండవచ్చు, గౌరవాలు ఉండవచ్చు, వీటివలన నీవు ఈ వికారాల నుండి బయటకు రాలేవు. ఈశ్వరుని పాదాలయందు భక్తిలేకుండా ఆయన పట్ల విశ్వాసం లేకుండా వీటిలో నుండి నువ్వు విడుదలపొందలేవు. డబ్బు సంపాదించటం, విద్య సంపాదించటం కష్టమే కాని ఈ వికారాల నుండి బయటకు రావటం అంత కంటే కష్టం, నాపట్ల భక్తి లేకుండా అది నీకు సాధ్యం కాదు అని పరమాత్మ చెపుతున్నాడు.

మిమ్మల్ని బంధించేది విషయచింతనే. విషయాలను చింతిస్తూ ఉంటే వాటి మీద ఆసక్తి కలుగుతుంది. నువ్వు ఏదైతే చింతిస్తున్నావో అదే అవుతావు. అందుచేత నీకు లోపల ఎటువంటి ఆలోచనలు వస్తున్నాయో చూసుకో. రామకృష్ణుడు మహేంద్రనాథ్‌గుప్తాతో ఏమని చెప్పాడు అంటే ఏమండీ హెడ్‌మాష్టారు మీలో ఈ లోపాలు ఉన్నాయి, వాటిలో నుండి బయటకు రాకుండా మీకు జ్ఞానం వచ్చే అవకాశం లేదు. అందుచేత మీరు ప్రయత్నం మొదలు పెట్టండి, నేను లాగేస్తాను అని చెప్పాడు. రామకృష్ణుడు ఉండగా ఆయన వాటిలో

నుండి బయటకు రాలేకపోయాడు. కాని గురువుగారు చెప్పిన మాటలు గుర్తు ఉండి, బాగా సాధన చేసి వాటిలో నుండి బయటకు వచ్చేసాడు. కోరికలలో నుండి బయటకు వచ్చాము కాని ఇంకా ఆసక్తిపోవటం లేదు అనుకున్నాడు. దీనికి పరమాత్మ ఏమని చెపుతున్నాడు అంటే నీలో అంతర్యామిగా ఉన్న నన్ను దర్శించే వరకూ నీకు ఆసక్తిపోదు అంటున్నాడు. ఈ దేహం మీది అని మీకు ఎవరైనా చెప్పాలా? మీకే తెలుస్తోంది కదా. అలాగే పరమాత్మ తోటి తాదాత్మ్యం అంత డైరెక్టుగా నీకు వస్తే అప్పుడు ఆసక్తిపోతుంది కాని అంతవరకు పోయే అవకాశం లేదు. ఆసక్తి కూడా నశిస్తేనే కాని వాడు జీవన్ముక్తుడు అవ్వడు.

నీ మనస్సును, ఇంద్రియాలను సాధ్యమైనంతవరకు అదుపులో పెట్టుకో. నువ్వు చెప్పినట్లు నీ మనస్సు వినాలి కాని నీ మనస్సు చెప్పినట్లు నువ్వు వినకూడదు. మీరు బాగు పడినా మీ మనస్సే కారణం, మీరు పాడైపోయినా మీ మనస్సే కారణం, అది ఆ పనీ చేస్తుంది, ఈ పనీ చేస్తుంది. అందుచేత నువ్వు నీ మనస్సును స్వాధీనం చేసుకొని, దానిని స్నేహితుడిగా చేసుకొని నువ్వు బాగుపడటానికి నీ మనస్సును ఉపయోగించుకొంటూ ఉంటే అప్పుడు నా సహాయ సహకారములు నీకు అందుతాయి అని పరమాత్మ చెపుతున్నాడు. ఈ శరీరాలు అన్నీ కామాగ్నిలో నుండి పుడుతున్నాయి, వీటినిచూసి మనం మురిసిపోతున్నాము. అంత మురిసిపోయేది ఈ శరీరంలో ఏముంది? ఈ శరీరాలను, ఇంద్రియాలను, మనస్సును నువ్వు బాగుపడటానికి ఉపయోగించుకో. కళ్ళతోటి మంచి దృశ్యాలు చూడవచ్చు, చెడ్డ దృశ్యాలు చూడవచ్చు. మంచి దృశ్యాలను చూడటం వలన మీరు బాగుపడతారు, చెడ్డ దృశ్యాలను చూస్తే మీకు వికారాలు వస్తాయి. అలాగే చెవులతో మంచిమాటలు వినవచ్చు, చెడు మాటలు వినవచ్చు. మంచిమాటలు వినటంవలన మనం బాగుపడతాము, చెడ్డమాటలు వినటం వలన మనలో వికారాలు వస్తాయి. నోటిని పాడుచేసుకోవద్దు అంటే నోటితో అపసవ్యం మాటలు మాట్లాడవద్దు. ఈ శరీరాలు, ఇంద్రియాలు అన్నీ కామాగ్నిలో పుట్టినా వాటని నువ్వు మేగ్జిమమ్ ఉపయోగించుకొని ఈ శరీరం చితాగ్నిలో కాలిపోకముందే నువ్వు జ్ఞానాగ్నిని ఆశ్రయించి జ్ఞానంలో ఐక్యం అవ్వాలి. దేవాలయాలలో అర్చకులు కూడా శ్రద్ధగా చెయ్యాలి. విగ్రహాలకు పూజలు చేసేటప్పుడు అది రాయి అనుకొని చెయ్యకూడదు, భగవంతుడే ఆ రూపంలో ఉన్నాడు అనే భావనతో చెయ్యాలి. మీ ఫొటోను ఎవరైనా అగౌరవపరిస్తే మీకు ఎంత బాధ కలుగుతుందో, లోపల ఉన్న విగ్రహాన్ని రాయి అనుకోవటం వలన భగవంతుడికి కూడా అంతే బాధ కలుగుతుంది. భగవంతుడిని నొప్పించే పనులు చేయకండి. దేవాలయానికి వెళ్ళి పూజలు చేసేటప్పుడు ఆ విగ్రహాన్ని భగవంతుడే అనుకొని అర్చన చేయండి. ఈ రూపాన్ని ధ్యానం చేసుకోండి, ఆ నామాన్ని స్మరించుకోండి. దేవాలయాలు అన్నీ మనకు ఉపాసనాకేంద్రాలు. మన భక్తి అభివృద్ధి అవ్వటానికి, భగవంతుడు ఉన్నాడు అనే విశ్వాసం పెరగటానికి దేవాలయాలను మనం ఉపయోగించుకోవాలి.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# వ్యాసాయ విష్ణురూపాయ

ప్రతి సంవత్సరం ఆషాఢ పూర్ణిమను గురుపూర్ణిమగా, వ్యాసపూర్ణిమగా జరుపుకోవడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. గురువు త్రిమూర్తి స్వరూపుడు. ఆత్మ విద్యను బోధించే సద్గురువే మనిషికి నిజమైన బంధువు. అజ్ఞానమనే చీకటిని పోగొట్టి, సుజ్ఞానమనే వెలుతురును ప్రసాదించే అనుగ్రహస్వరూపమే గురువు. ఈ భూమిపై అవతరించిన గురుమూర్తులలో భగవాన్ వ్యాసమహర్షి ఒకరు. అట్టి వ్యాసమహర్షి పుట్టినరోజును గురుపూర్ణిమగా జరుపుకొంటున్నాం. బ్రహ్మముగా జీవించి, బ్రహ్మముగా బోధించి, జీవకోటిని స్వరూప ఎరుకలోకి మేల్కొలిపిన సద్గురువు వ్యాసమహర్షి, అందుకే 'వ్యాసాయ విష్ణు రూపాయ' అంటారు. ప్రతి జీవిని అంతర్యామిగా ఉన్న స్వరూప చైతన్యం లోకి మేల్కొలిపి, అవిద్యా రూపమైన జనన, మరణ సంసారం నుండి విముక్తులను చేయడమే గురువు చేసే పని. అట్టి గురువుల ద్వారా ముముక్షువులెందరో తరించారు. గురుబోధ కేవలం పుస్తకాలకో, సిద్ధాంతాలకో పరిమితమైనదికాదు, జీవితాన్ని సమగ్రంగా దర్శింపజేస్తుంది. సద్గురు బోధను ఆచరణలో పెట్టి, నిత్యజీవితానికి అన్వయించుకొని తరించాలి. కారణజన్ములైన అట్టి మహాత్ములు దేహధారులై గురురూపంగా ఈ భూమిపై అవతరించి, భిన్నత్వంలోని ఏకత్వాన్ని దర్శించి, తామే వెలుగై, లోకానికి వెలుగును ప్రసరిస్తూనే ఉన్నారు. అట్టి గురుపరంపరకు మనమెంతో ఋణపడి ఉంటాం.

(ది॥ 03-07-2012 గురుపూర్ణిమ సందర్భంగా......)

**- చావలి సూర్యనారాయణమూర్తి**

అమలాపురం

# అహంకారానికి దైన్యం జీవనాధారం - దాన్ని మెడపెట్టి గెంటాలి

జీవన సంగ్రామంలో ఆనందపూరితమైనవి, దైన్యపూరితమైన క్షణాలు ఉంటాయి. అవి వాటంతట అవి వస్తాయి పోతాయి. మనం దైన్యాన్ని నిరోధించలేము. వాటి దృఢత్వం వాటికి ఉంటుంది. తీవ్రమైన నిరుత్సాహస్థితే అతి ప్రమాదకరమైన రుగ్మత. మన శరీర వ్యవస్థను కుళ్ళిపోయేటట్లు చేస్తుంది. గత క్లేశాలతో మనలను మనం చంపుకొంటాము. మనకు సత్యం అర్థమైతే ఈ క్షణంలోనే స్వేచ్ఛను అనుభవిస్తాము. కాని మన మీద మనం జాలిపడిపోయే అలవాట్లలో పడి కూరుకొనిపోతాము. మనం దైన్యాన్ని చేతులతో కప్పుకొని కూర్చున్నాము. దానితో ఖైదీగా ఉండిపోతాము. అహంకారినికి దైన్యం కొండంత కావాలి. సూఫీలు లేచినా, కూర్చున్నా 'అల్లాహ్' అని మనవాళ్ళు 'హరి' అని గురునామాన్ని ఉచ్ఛరిస్తారు. అది పోనుపోను మనకు మన చేష్టలకు మధ్యన ఆ నామం నిలుస్తుంది. నేను కేవలం పరికరాన్ని అనుకోవటం వల్ల దైన్యం నశించిపోతుంది. మనం అభ్యాసి అయితే లోపల పొరల్లోకి చేరుకుంటాము. అప్పుడు దైన్యాన్ని అడ్డుకొంటాము. ఈ ప్రయత్నంలో చిన్నపాటి సోమరితనం మహాయత్నాల లాభాలను జారవిడుకుకొంటాము. "ఆత్మజ్ఞానం ప్రాప్తించిన క్షణంలోనే దైన్యం మాయమౌతుంది" అంటారు పెద్దలు. మనకు కలిగిన దూషణలగాయాలు, అవమానాలు ఇతరులతో నొక్కి వక్కాణిస్తాము. అది ఎంత పాతదైనా అలంకరించబడి కొత్తగా కనిపిస్తుంది. మనం గులాబీని చూడము దాని ముళ్ళను చూస్తాము. దైన్యంలో ఉన్న వ్యక్తిని ప్రజలు జాలిపడతారు. ప్రేమిస్తారు ఎవ్వరూ హాని చెయ్యరు. ఈ దైన్యానికి పూర్వం మన కర్మయే కారణమని అంగీకరించటానికి సిద్ధంగా లేకపోవటంవల్ల బలహీనత మొదలౌతుంది. దానితో పగ-ప్రతీకారం తీర్చుకోవాలనే బుద్ధిలో ఆక్రోశిస్తాము. ఇనప గొలుసులతో బంధింపబడి ఉంటే గొడ్డలితో నరుక్కుని బయట పడగలం గాని, దైన్యం నుంచి మనం బయట పడలేము. ఆ గాయాలపుండును నిరంతరం కెలుకుతూ ఆపుండును జీవితాంతం మానకుండా చేసుకోగలము. అది అవగాహనా లోపం. మన నిజస్థితి మన ఎరుకలో ఉంటే మన దగ్గర ఏ లోటు లేదని అది అకస్మాత్తుగా ధైర్యం వస్తుంది. మనం నిస్సహాయులం కామని శక్తులన్నిటికీ మనమే నిధి అని. జీవితానికి మనమే మూలాధారమని, మనం దుర్బలులమనే భావాన్ని సమాజం సృష్టించింది అని గ్రహించాలి. అదృష్టం అనేది దానికి అది పుట్టుకొనిరాదు దాన్ని మన జీవితంలో ప్రయత్నపూర్వకంగా ఉండవలసి ఉంది. గత జన్మలో చేసిన కర్మ సంబంధిత పాపం. ఈ జన్మలో ముగించుకోవటం మంచిది. అసహనాలాను, అసూయతలను, ద్వేషాలను సంతోషంగా ప్రశాంతంగా అనుభవించాలి. ఏమాత్రం నిరశించకూడదు. నిరసిస్తే మరోసారి కర్మలను సృష్టించుకొంటాము. దుఃఖపడతాము ఉన్నది చాలు దుఃఖాలను శాపంగా భావించక దాన్ని శాంతంగా ఏ నిరసనా లేకుండా ఏ తిరుగుబాటు లేకుండా అనుభవించితే శాంతి స్థితిని పొందుతాము. అంతేగాని నా జన్మ అంతా దుర్భరంగా గడిచిపోయింది. విధి అనే రాక్షసి అతిక్రూరంగా బలితీసుకొంది అనుకొంటే ఒడ్డుకు రాలేము. జీవితంలో కష్టసుఖాలు ఏమీ నిలబడవన్న స్ఫూర్తి మనలో ఉంటే దైన్యం దయనీయస్థితిలో కొట్టుకుపోతుంది.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం